ఆంధ్ర ప్రదేశ్
మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 75 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం 17 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02



## బడ్జెట్ హామీలు నెరవేర్చాల్సిందే

ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండకూడదు
ఆదాయ వనరులు పెంచుకోండి.. ఆర్థిక శాఖకు సీఎం దిశానిర్దేశం
ప్రజలకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ లక్ష్యాలు చేరుకోవాలి
అమరావతి, పోలవరం సహా ప్రాజెక్టులు పూర్తయితే సంపద సృష్టి
కేంద్ర పథకాల ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయాలి: సీఎం
అధికారులకు కీలక సూచనలు
సచివాలయంలో ఆర్థికశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
జీఎస్డీపీ లక్ష్యాల సాధనకు అనుసరించాల్సిన ప్రణాళికలపై సీఎం సమీక్ష
సమీక్షలో పాల్గొన్న ఆర్థికమంత్రి పయ్యావుల, సీఎస్ సాయిప్రసాద్, అధికారులు

రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా మైక్రో, మాక్రో స్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పూర్తి స్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ఆర్థిక శాఖకు సూచించారు. 15 శాతం మేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికల్ని సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

## మోదీ ప్రసంగంలో డీలిమిటేషన్ ప్రస్తావన లేదు

- రాష్ట్రాల ఆందోళనలను ఉద్దేశపూర్వకంగా విస్మరించారు
- ప్రధాని స్పీచ్‌పై కాంగ్రెస్ ఫైర్
- లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కాంగ్రెస్
- మోదీ తన స్పీచ్‌లో డీలిమిటేషన్ అనే కీలక అంశాన్ని మినహాయించారని ఆరోపణలు
- 'మోదీ ఉద్దేశపూర్వక అంధత్వాన్ని ప్రదర్శించారు'
- మోదీ సర్కార్ విపక్షాల్లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది : జైరాం రమేశ్



## ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు మరో గుడ్‌న్యూస్

ఎస్ఆర్‌బీఎస్ నిధులు విడుదల
స్టాఫ్ రిటైర్మెంట్ బెట్ ఫిట్ స్కీం నిధులు వాపస్ చేసేందుకు నిధులు విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం
8,450 మంది ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75 కోట్లు విడుదల
ఏపీఎస్ ఆర్టీసీలో 7,673 పోస్టులు
ఒక్కో ఉద్యోగికి రూ.15 లక్షలు




# రంగం సిద్ధం!

- డీలిమిటేషన్‌ను వెనక్కి తీసుకోవాలి
- దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలతో పాటు,పంజాబ్,ఒడిశాలకు నష్టం
- దేశ మహిళలను మోసగిస్తున్నారు.. దాన్ని అంగీకరించం
- లోక్‌సభలో ముక్త కంఠంతో ప్రతిపక్షాల డిమాండ్
- మహిళా రిజర్వేషన్ పేరుతో బుల్డోజ్: గౌరవ్ గగోయ్
- రాజకీయ కోణంలో చూడొద్దు: ప్రధాని మోదీ
- అమిత్ షా వర్సెస్ అఖిలేశ్ యాదవ్
- ఏపీ ఎంపీల మద్దతుపై పునరాలోచించాలి: డింపుల్ యాదవ్
- సమాఖ్యవాదంపై దాడి ఈ కొత్త బిల్లు ఒక రాజకీయ నాటకం
- ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి: సీపీఐ(ఎం) ఎంపీ కె.రాధాకృష్ణన్
- దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం
- దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు : ప్రధాని మోదీ
- మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారన్న ప్రధాని మోదీ
- మహిళల బిల్లు విషయంలో అందరూ కలిసి రావాలని పిలుపు




## భారత్ జీడీపీ ర్యాంక్ డ్రాప్

- ఐఎంఎఫ్ జీడీపీ ర్యాంకింగ్‌లో ఆరో స్థానానికి పడిపోయిన భారత్
- 2026 సంవత్సరానికి ఐఎంఎఫ్ ర్యాంకింగ్ ప్రకారం భారతదేశ జీడీపీ 4.15 ట్రిలియన్ డాలర్లు

## ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు



- హార్ముజ్‌పై కన్నేస్తే యూఎస్ నౌకలను సముద్రంలో కూల్చేస్తాం : ఇరాన్ హెచ్చరిక
- రెండో విడత చర్చల కోసం కొనసాగుతున్న దౌత్య యత్నాలు
- ఇరాన్ ఆర్థిక వనరులను దెబ్బ తీసేందుకే...
- మీరు హార్ముజ్‌కు పోలీసా : ట్రంప్‌ను ప్రశ్నించిన టెహ్రాన్
- కొనసాగుతున్న దౌత్య యత్నాలు
- ఇటలీ ప్రధానిపై ట్రంప్ ఆగ్రహం
- ఆచితూచి అడుగేస్తున్న చైనా ఇరాన్, అమెరికాలతో సత్సంబంధాలు
- మధ్యవర్తిత్వానికి సంసిద్ధత...ఆసక్తి చూపని వాషింగ్టన్
- తొలి త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి సాధించిన చైనా
- దౌత్య యత్నాలకు మద్దతిస్తాం : జపాన్
- ప్రపంచం శాంతి సందేశాన్ని వినాలి : పోప్ లియో
- లెబనాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాడులు



# రంగం సిద్ధం

డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును వెనక్కి తీసుకోవాలని లోక్‌సభలో ప్రతిపక్షాలు ముక్త కంఠంతో డిమాండ్ చేశాయి. "మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం అనుకూలం. కానీ డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలతో పాటు, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలు నష్టపోతు న్నాయి. పెంచిన సీట్ల సంఖ్యను ఎవరు నిర్ణయిస్తారు? ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారు? ఏ రాష్ట్రానికి ఎన్ని సీట్లు ? 2029 ఎన్నికల్లో గెలవడం కోసమే డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చారు. అందుకే అసోం, జమ్మూ కాశ్మీర్‌లో వలే డీలిమిటేషన్ వంటి వక్ర మార్గాన్ని ఎంచుకున్నారు. ప్రజలు చాలా విజ్ఞాన వంతులు. మీ మోసాన్ని తెలుసుకుంటారు" అని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. "మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లో ఆమోదం పొందింది. కానీ 2024 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయలేదు. హఠాత్తుగా ఇప్పుడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న వేళ మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో హడావుడి చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం అసలు లక్ష్యం మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం కాదు. డీలిమిటేషన్ బిల్లు ఆమోదంతో తమకు నచ్చినట్టు లోక్‌సభ సీట్లు పెంచుకోవడమే. దేశ మహిళలను చీట్ చేస్తున్నారు. దాన్ని అంగీకరించం" అని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు–2026ను కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లు–2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026లను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఈ బిల్లులను ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బిల్లుల సవరణల పట్ల కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, ఎంపీ ధర్మేంద్ర యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీ రాధాకృష్ణన్, టీఎంసీ ఎంపీ కకోలి ఘోష్, ఆర్‌ఎస్పీ ఎంపీ ఎన్. కె ప్రేమ్ చంద్రన్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు తీవ్ర అభ్యంతరం చేశారు. బిల్లులు ప్రవేశపెట్టడంపై ప్రతిపక్షాలు ఓటింగ్ డిమాండ్ చేశాయి. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్‌ను నిర్వహించారు. 333 మంది ఎంపీలు ఓటు వేయగా, అనుకూలంగా 207, వ్యతిరేకంగా 126 ఓట్లు వచ్చాయి. అనంతరం స్పీకర్ ఓం బిర్లా బిల్లులపై చర్చకు అనుమతిచ్చారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ బిల్లులపై చర్చను ప్రారంభిస్తూ 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ విధానాన్ని .. జనాభా లెక్కలు, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత అమలు చేయనున్నట్టు చెప్పారు. లోక్‌సభలో సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచనున్నట్లు చెప్పారు. 815 సీట్లకు ఆ సంఖ్య చేరుకోనున్నట్టు తెలిపారు. 272 సీట్లను మహిళలకు కేటాయించనున్నట్టు చెప్పారు. దీనివల్ల ఏ రాష్ట్రం కూడా తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోదని, ప్రస్తుతం ఉన్న ఆయా రాష్ట్రాల సామర్థ్యం అలాగే కొనసాగుతుందని ఆయన అన్నారు. పురుషులకు కానీ, రాష్ట్రాలకు కానీ తాజా బిల్లులలో ఎటువంటి నష్టం ఉండబోదన్నారు. 131వ రాజ్యాంగ సవరణ 2026 బిల్లుతో మహిళలకు సమానత్వం వస్తుందన్నారు. తమ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగులు వేస్తున్నట్టు తెలిపారు.

**మహిళా రిజర్వేషన్ పేరుతో బుల్డోజ్: గౌరవ్ గగోయ్ (కాంగ్రెస్ ఎంపీ)**

మహిళా రిజర్వేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలని చూస్తున్నట్టు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ విమర్శించారు. ఒకవేళ మహిళా కోటా చట్టాన్ని అమలు చేయాలనుకుంటే, తాజా లోక్‌సభ సీట్ల సంఖ్య ఆధారంగా తక్షణమే రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. మహిళలకు ఆ బిల్లులు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కులగణనకు, రాజ్యాంగా నికి, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఆ బిల్లులు ఉన్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్‌ను కేంద్రం బుల్డోజ్ చేస్తున్నదని ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్‌కు తాము మద్దతు ఇస్తామని, కానీ దాన్ని సరళీకరించాలని, డీలిమిటేషన్‌తో లింకు చేయవద్దు అని కోరారు. 543 సీట్ల ఆధారంగానే లోక్‌సభలో రిజర్వేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. జాప్యం చేసేందుకే రెండు బిల్లులను కలిపినట్లు ఆయన ఆరోపించారు. ఒకవేళ తాము చెప్పినట్టు 2023లోనే విని ఉంటే, 2024లోనే మహిళా రిజర్వేషన్ అమలు అయ్యేదని అన్నారు.

**రాజకీయ కోణంలో చూడొద్దు: ప్రధాని మోడీ**

మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడొద్దు అని ప్రధాని మోడీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదని, దానికి రాజకీయ రంగు పూయొద్దని తెలిపారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ తమ ప్రభుత్వానికి కానీ, మోడీకి కానీ దక్కదని, ఇది దేశ ప్రజాస్వామ్యానికి దక్కుతుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించొద్దని, కావాలంటే మీరే క్రెడిట్ తీసుకోవచ్చని ఆయన ప్రతిపక్షాలకు తెలిపారు. దేశ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలని అన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందని తెలిపారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారని అన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయొద్దని తెలిపారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదని, ఎవర్నీ వివక్షాపూరితంగా చూడబోమని అన్నారు.

# ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు

హార్ముజ్ జలసంధిని దిగ్బంధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఇరాన్ చమురు పరిశ్రమపై మరిన్ని ఆంక్షలు విధించారు. మరోవైపు హార్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తే ఆ దేశానికి చెందిన నౌకలను తమ తొలి క్షిపణి దాడి సముద్రంలో ముంచేస్తుం దని ఇరాన్ హెచ్చరించింది. అంతేకాక జలసంధి దిగ్బంధనం ఇలాగే కొనసాగితే వేలాది మంది అమెరికా సైనికులను బందీలుగా పట్టుకుంటామని తెలిపింది. ఇదిలావుండగా అమెరికా–ఇరాన్ మధ్య రెండో విడత చర్చలకు అవకాశం కల్పించి, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను నివారించేందుకు దౌత్య యత్నాలు కొనసాగుతున్నాయి. రష్యా, ఇరాన్ దేశాల ముడి చమురును పలు ప్రపంచ దేశాలకు విక్రయిస్తున్న పెట్రోలియం వ్యాపారవేత్త మహమ్మద్ హుస్సేన్ షమ్ఖానీ నెట్ వర్క్‌లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్న పాతిక మందికి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై అమె రికా తాజాగా ఆంక్షలు విధించింది. చమురు రవా ణాకు చెందిన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అమె రికా ఈ చర్య తీసుకుంది. షమ్ఖానీ ఇరాన్ ప్రజల సొమ్ముతో లాభాలు దండుకుంటున్నారని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ఆరోపించారు. షమ్ఖానీ ఇరాన్ సెక్యూరిటీ అధికారి అలీ షమ్ఖానీ కుమారుడు. ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీకి సలహాదారు. వీరిద్దరూ అమెరికా–ఇజ్రాయిల్ జరిపిన దాడిలో తొలి రోజే చనిపోయారు. ఇరాన్‌ను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడానికి అమెరికా చేయాల్సిందంతా చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా హార్ముజ్ దిగ్బంధనం ప్రారంభమైన తర్వాత తొలి 48 గంటలలో ఇరాన్ ఓడరేవుల నుంచి బయటికి పోకుండా పది నౌకలను అడ్డుకున్నానని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. అయితే కనీసం మూడు నౌకలు ఇరాన్ ఓడరేవుల నుంచి బయలుదేరి హార్ముజ్‌ను దాటాయని షిప్ ట్రాకింగ్ డేటాను బట్టి తెలుస్తోంది. హార్ముజ్ జలసంధిపై పెత్తనం చెలాయించాలని చూస్తే అమెరికా నౌకలను ధ్వంసం చేస్తామని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారు మొ?సేన్ రెజారు హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వ టీవీకి ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ 'హార్ముజ్ జలసంధికి పోలీసులా వ్యవహరించాలని ట్రంప్ అనుకుంటున్నారు. నిజానికి ఇదేనా మీ పని? శక్తివంతమైన సైనిక బలగం ఉండి చేయాల్సిన పని ఇదేనా?' అని ప్రశ్నించారు. అమెరికా నౌకలను తమ తొలి క్షిపణి దాడే సముద్రంలో ముంచేస్తుందని చెప్పారు. అక్కడ ఉన్న అమెరికా సైనికులు కూడా చనిపోతారని, భూతల దాడులకు వచ్చే సైనికులను బందీలుగా పట్టుకుంటామని తెలిపారు. ప్రతి బందీకి బిలియన్ డాలర్లు సంపాదిస్తామని అన్నారు. కాల్పుల విరమణను కొనసాగించడాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తానని రెజారు చెప్పారు.

# బడ్జెట్ హామీలు నెరవేర్చాల్సిందే

సచివాలయంలో ఆర్థిక శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నీరు, విద్యుత్ లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామని ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఉన్నా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు. పూర్వోదయ, సాస్కి లాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్?కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని సూచించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయగా మూసివేశారని ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నార్తుల కడుపు నింపేలా రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. బడ్జెట్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత అడ్డంకి కాకూడదని ఆర్థిక శాఖకు స్పష్టం చేశారు. నిధుల కొరత ఉన్నప్పటికీ ఆదాయ వనరులు పెంచుకోవడం ద్వారా హామీలు అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుంచి నిధుల రూపంలో అందే సహకారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని.. పీపీపీ విధానంలో చేయదగిన ప్రాజెక్టులను గుర్తించాలని సూచించారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా సూక్ష్మ, స్థూల ప్రణాళికలు అమలు చేయాలని.. పూర్తిస్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. 15 శాతం వృద్ధిరేటు లక్ష్యాన్ని అందుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికలను సమర్థంగా అమలుచేయాలన్నారు. నీరు, విద్యుత్ లాంటి వనరులను వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేర అందిస్తున్నామని.. ఈ నేపథ్యంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులున్నా విద్యుత్ చార్జీలు పెంచలేదని.. గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4,600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని గుర్తుచేశారు. ప్రజలపై భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయన్నారు. 'సింగపూర్ చిన్న దేశమైనా బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించింది.. అక్కడ ఒకే ప్రభుత్వం అధికారంలో ఉండడం.. అవినీతి రహితంగా ఉండడం, పాలనా సంస్కరణలు, అపారమైన మేధోశక్తి ఈ రోజు ఆ దేశాన్ని ప్రపంచంలోనే ఉన్నతస్థానంలో నిలబెట్టాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ నెల 21 నుంచి 27 వరకు 9 మంది మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం సచివాలయంలో ఆయన వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైసీపీ హయాంలో సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో భాగంగా వెళ్తున్న మీరంతా.. అక్కడి పాలనా సంస్కరణలు, పాలనలో వేగం, పారదర్శకతను పెంచేందుకు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. '2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే ఈ రోజు రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్లేది. జగన్ రావడంతో ఆర్థిక విధ్వంసంతోపాటు పారిశ్రామికవేత్తలు పారిపోయారు. ఇలాంటి అభివృద్ధి నిరోధకుడితో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగింది' అని ధ్వజమెత్తారు. జగన్ నిర్వాకంతో సింగపూర్ ప్రభుత్వం మనతో మాట్లాడేందుకు కూడా ఇష్టపడలేదన్నారు. ఏపీకి రావలసిన సింగపూర్ కంపెనీలు మలేసియాలో టౌన్‌షి?పలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని, పి.నారాయణ, నిమ్మల, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ పాల్గొన్నారు.

# భారత్ జీడీపీ ర్యాంక్ డ్రాప్

అంతర్జాతీయ ద్రవ్య నిధి తన తాజా వరల్డ్ ఎకనామిక్ ఔట్లుక్ (ఏప్రిల్ 2026) నివేదికలో భారత్‌ను నామినల్ జీడీపీ (ప్రస్తుత ధరలు, అమెరికా డాలర్లలో) ఆధారంగా ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తించింది. యునైటెడ్ కింగ్‌డమ్ ముందుకు వచ్చి భారత్‌ను వెనక్కి నెట్టడంతో, ఇంతకు ముందు కొన్ని సంవత్సరాలుగా 5వ స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు ఆరో స్థానానికి పడిపోయింది. ఐఎంఎఫ్ జీడీపీ ర్యాంకింగ్‌లలో భారతదేశం ఒక స్థానం దిగజారి, గత ఏడాది ఐదో స్థానం నుంచి ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. ఐఎంఎఫ్ గణాంకాల ప్రకారం, 2025 నాటికి భారతదేశ జీడీపీ సుమారుగా 3.92 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా కాగా, బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకు, జపాన్ ఆర్థిక వ్యవస్థ 4.44 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా. 2026 సంవత్సరానికి ఐఎంఎఫ్ ర్యాంకింగ్ ప్రకారం భారతదేశ జీడీపీ 4.15 ట్రిలియన్ డాలర్లు, బ్రిటన్ జీడీపీ 4.26 ట్రిలియన్ డాలర్లు, జపాన్ జీడీపీ 4.38 ట్రిలియన్ డాలర్లు, జర్మనీ జీడీపీ 5.45 ట్రిలియన్ డాలర్లు, చైనా జీడీపీ 20.85 ట్రిలియన్ డాలర్లు, అమెరికా జీడీపీ 32.38 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఐఎంఎఫ్ అన్ని దేశాల జీడీపీని డాలర్లలో కొలుస్తుంది. గత సంవత్సరం, 2024లో, భారతదేశం 5వ స్థానంలో ఉండేది. ఆ సమయంలో భారతదేశ జీడీపీ 3.5 ట్రిలియన్ డాలర్లు కాగా, బ్రిటన్ జీడీపీ 3.4 ట్రిలియన్ డాలర్లుగా ఉండేది. కానీ ఇప్పుడు, బ్రిటన్ భారతదేశాన్ని అధిగమించింది. రూపాయి విలువ 93కి పడిపోయిన తరుణంలో భారతదేశ ర్యాంకింగ్‌లో ఈ తగ్గుదల చోటుచేసుకుంది.

**రూపాయి బలహీనత:** ఐఎంఎఫ్ జీడీపీని అమెరికన్ డాలర్లలో పోలుస్తుంది. అందువల్ల, డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి బలహీనపడినప్పుడు, భారతదేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం (జీడీపీ) డాలర్ల పరంగా దానంతట అదే చిన్నదిగా కనిపిస్తుంది. భారతదేశంలో ఉత్పత్తి, ఆదాయాలు పెరుగుతున్నప్పటికీ, రూపాయి విలువ పడిపోతే, అంతర్జాతీయంగా దాని విలువ తక్కువగా కనిపిస్తుంది. అందుకే ఇటీవలి రూపాయి విలువ క్షీణత భారతదేశ ప్రపంచ ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. అంటే, బలమైన వాస్తవ ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ, డాలర్ విలువ క్షీణించడం వల్ల భారతదేశ ర్యాంకింగ్ పడిపోయింది. జీడీపీ ఆధార సంవత్సరంలో మార్పు: భారత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను లెక్కకట్టే విధానాన్ని నవీకరించింది, ఆధార సంవత్సరాన్ని 2011–12 నుండి 2022–23కి మార్చింది. ఆధార సంవత్సరాన్ని మార్చడం అంటే, ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను కొత్త ప్రమాణాలు, కొత్త డేటాను ఉపయోగించి కొలుస్తున్నారని, దీనివల్ల గణాంకాలు మునుపటి కంటే మరింత కచ్చితమైనవిగా, వాస్తవికమైనవిగా మారాయని అర్థం. అయితే, ఈ కొత్త పద్ధతిని ఉపయోగించి గత సంవత్సరాల జీడీపీని తిరిగి లెక్కించినప్పుడు, అనేక రంగాల అంచనాలు కొద్దిగా తగ్గాయి. ఈ కారణంగానే భారతదేశ నామమాత్రపు జీడీపీ గతంలో అంచనా వేసిన దానికంటే కొద్దిగా తక్కువగా కనిపిస్తోంది.

# ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు మరో గుడ్‌న్యూస్

ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో తీపికబురు చెప్పింది. స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం (ఎ=దీూ) నిధులు వాపస్ చేసేందుకు నిధులు విడుదల చేసింది. ఎూఖ=ఙజ లోని ఎస్?ఆర్?బీఎస్ సభ్యులై పొదుపు చేసిన ఆర్టీసీ ఉద్యోగుల డబ్బు వాపస్ చేయనుంది. 2030 మే నెల వరకు రిటైర్డ్ అయ్యే ఉద్యోగులకు చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. దీంతో 8450 మంది ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75 కోట్లును ప్రభుత్వం విడుదల చేసింది. రిటైర్మెంట్ తర్వాత పింఛన్ కోసం ఎ=దీూ ను ఏర్పాటు చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగులు నెల నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునేవారు. ప్రభుత్వంలో విలీనం అనంతరం ఎ=దీూను వైఎస్సార్సీపీ ప్రభుత్వం రద్దు చేసింది. తాము పొదుపు చేసిన మొత్తం తిరిగి ఇవ్వాలని ఉద్యోగుల కోరిక మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిధులు విడుదల చర్యలు తీసుకోవడంపై ఆర్టీసీ కార్మికపరిషత్ నేతలు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, రవాణామంత్రి రాంప్రసాదరెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్, వీణ కు కార్మిక పరిషత్ శేషగిరిరావు, వై శ్రీనివాస్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

**ఏపీఎస్‌ఆర్టీసీలో 7,673 పోస్టులు :** మరోవైపు ఏపీఎస్ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్ తదితర పోస్టులకు ప్రాధాన్యతతో భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల్లో 7,673 పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని సూచించిన మంత్రి, అనుమతి రాగానే ప్రాధాన్యత క్రమంలో పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించారు. 2020లో ఆర్టీసీలో 51,488 మంది ఉద్యోగులు ఉండగా ప్రస్తుతం 44,131 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రానున్న 3 ఏళ్లలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రిటైర్ కానున్నందున ఉద్యోగుల భర్తీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఉద్యోగుల ప్రమోషన్లు, బకాయిల చెల్లింపులు, నియామకాలు, వైద్య కారణాలతో రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలు, కారుణ్య నియామకాలు, సీనియారిటీ జాబితాలు, కోర్టు కేసుల స్థితిగతులపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. వైద్య కారణాలతో రిటైర్ అయిన ఉద్యోగుల గురించి చర్చించారు. 2020 జనవరి నుంచి వైద్య కారణాలతో 682 మంది ఉద్యోగులు రిటైర్ అయినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగం, మిగిలిన 646 మంది ఉద్యోగులకు ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని వివరించారు.

**ఒక్కో ఉద్యోగికి రూ.15 లక్షలు :** ఇలా ఒక్కో ఉద్యోగికి రూ.15 లక్షల చొప్పున మొత్తం ఆర్థిక భారం 96.90 కోట్ల రూపాయులు చెల్లించాల్సి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ అధికారులకు వివరించారు. అలాగే సీనియారిటీ జాబితాల ఆధారంగా డీపీసీలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కోర్టు కేసుల స్థితిగతులపై అధికారుల నుంచి నివేదిక తీసుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరిత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెడికల్ అన్?ఫిట్ అయిన ఉద్యోగులకు ఉద్యోగాలు: ప్రభుత్వంలో విలీనం తర్వాత మెడికల్ అన్?ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొద్దిరోజుల క్రితమే కీలక అదేశాలు జారీ చేసింది. 2020 జనవరి 1 తర్వాత మెడికల్ అన్?ఫిట్ అయిన ఉద్యోగులకు ఆర్టీసీలో లేదా ప్రభుత్వ విభాగాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కాక మునుపు మెడికల్ అన్?ఫిట్ అయిన డ్రైవర్లకు మాత్రమే ప్రత్యామ్నాయ ఉద్యోగాలిచ్చే విధానం అమల్లో ఉండేది. ఇకపై ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, సహా మిగిలిన ఉద్యోగులందరికీ ప్రత్నామ్నాయ ఉద్యోగాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# మోదీ ప్రసంగంలో డీలిమిటేషన్ ప్రస్తావన లేదు

మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ తన ప్రసంగంలో నియోజకవర్గాల పునర్విభజన అనే కీలక అంశం మినహా మిగతా అన్ని విషయాలపై మాట్లాడారని ఎద్దేవా చేసింది. దక్షిణాది, తూర్పు, ఈశాన్యం, ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల ఆందోళనలను తన ప్రసంగంలో మోదీ ఉద్దేశపూర్వకంగా విస్మరించారని ఆరోపించింది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులపై ఓటింగ్‌కు పెట్టినప్పుడు అది వీగిపోతుందని కాంగ్రెస్? తెలిపింది. రాజ్యాంగాన్ని అణగదొక్కడానికి, వ్యవస్థను హైజాక్ చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత ప్రయత్నం లోక్‌సభలో నిస్సందేహంగా ఓటమిని చవిచూస్తుందని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

**'మోదీ ఉద్దేశపూర్వక అంధత్వాన్ని ప్రదర్శించారు' :** డీలిమిటేషన్ ఎలా జరుగుతుందనే దానిపై ఎలాంటి వివరాలను లిఖితపూర్వకంగా వెల్లడించడానికి మోదీ ప్రభుత్వం నిరాకరించిందని జైరాం రమేశ్ విమర్శించారు. అందుకు బదులుగా లోక్‌సభ స్థానాలను సమూలంగా మార్చే ప్రమాదకరమైన బిల్లులను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. పలువురు సీఎంలు, ఎంపీలు లేవనెత్తిన తీవ్రమైన సమస్యలను సాంకేతిక సాకులు అని ప్రధాని మోదీ ముద్ర వేశారని మండిపడ్డారు. దక్షిణాది, తూర్పు, ఈశాన్యం, నార్త్ ఇండియాలోని పలు రాష్ట్రాల ఆందోళనల పట్ల మోదీ ఉద్దేశపూర్వక అంధత్వాన్ని ప్రదర్శించారని దుయ్యబట్టారు. ఆ ప్రాంతాల ప్రజల న్యాయమైన ఆందోళనలను అత్యంత నిర్లక్ష్యంగా కొట్టిపారేశారని విమర్శించారు. ఈ నెల చివరలో జరిగే ఎన్నికల్లో తమిళనాడు, బంగాల్ ప్రజలు ఈ అవమానానికి నిస్సందేహంగా ప్రతిస్పందిస్తారని అన్నారు. ప్రధాని తన ప్రసంగంలో తన కుల నేపథ్యాన్ని కూడా సౌకర్యవంతంగా ప్రస్తావించారని గుర్తు చేశారు. కానీ మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినప్పుడు (2023 సెప్టెంబరులో) నుంచి ఈ రోజు (గురువారం) వరకు ప్రతిపక్షం నిరంతరం లేవనెత్తుతున్న అంశంపై మోదీ తన ప్రసంగంలో స్పందించలేదన్నారు. "ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళల కోసం రిజర్వేషన్‌లో కోటాను ప్రవేశపెట్టాలి. కానీ ప్రధాని మోదీ రాజకీయ ప్రయోజనాల కోసం తన గుర్తింపును ప్రదర్శిస్తూనే ఉన్నారు. కానీ ఈ డిమాండ్ పట్ల కావాలనే చెవిటివారిలా వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ల కారణంగా దేశవ్యాప్తంగా నారీమణుల్లో వచ్చిన రాజకీయ చైతన్యాన్ని ప్రధాని మోదీ పరోక్షంగా అంగీకరించారు. క్షేత్రస్థాయిలో జరిగిన ఈ విప్లవం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దార్శనికతకు ప్రతిరూపం అనే విషయాన్ని మోదీ ప్రస్తావించలేదు. మహిళల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ నిబద్ధతను ఎవరూ సవాలు చేయలేరు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, వ్యవస్థను హైజాక్ చేసే ఈ కుట్రపూరిత ప్రయత్నంలో రేపు (శుక్రవారం) సాయంత్రం 4 గంటలకు లోక్‌సభలో మోదీ ప్రభుత్వం నిస్సందేహంగా ఓటమిని చవిచూస్తుంది. బిల్లును ప్రవేశపెట్టేందుకు జరిగిన ఓటింగ్ కేవలం ఒక ట్రైలర్ మాత్రమే" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

# డీలిమిటేషన్ బిల్లును చంద్రబాబు, జగన్, పవన్ వ్యతిరేకించాలి

## నిబద్ధత

గమ్యాన్ని ఏర్పరుచుకోవడం
ఎంత ముఖ్యమో దాని పట్ల
నిబద్ధత కూడా అంతే ముఖ్యం
విజేతలైన వారెప్పుడూ తమ
గమ్యం పట్ల తమకున్న నిబద్ధత
విషయంలో ప్రశ్నించుకోవాలి
జీవితంలో మనం కావాలనుకునే
దానికి పొందేదానికి బేధం ఉండదు
గమ్యాన్ని చేరే ప్రయత్నంలో
సొంత ప్రతిభ, సామర్థ్యాలపై
నమ్మకంతో పనులు సరైన
రీతిలో చెయ్యాలి
పరిస్థితులలో మీ సామర్థ్యంపై
నమ్మకం ఉంచి సరైన మార్గాన్ని
మాత్రమే ఎంచుకోవాలి
నిజాయితీ నుంచి సడలని
మనస్తత్వం కావాలి
నీతి, నిజాయితీ పట్ల
మీ యొక్క నిబద్ధత
తాత్కాలిక ప్రయోజనాలకై
ఆశపడడం ఏది ముఖ్యమనేది
మనమే నిర్ణయించుకోవాలి.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

**-మహిళా బిల్లు కోసం 1952 నుంచే సీపీఐ ఎంపీల పోరాటం**
**-మహిళా బిల్లు ముసుగులో మోదీ కీలక బిల్లుల ఆమోదానికి కుట్ర**
**-డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు ముప్పు.. విస్తృతమైన చర్చ జరగాలి**
**: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి**

దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేకూర్చేలా పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం పెట్టనున్న నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ బిల్లును సీఎం చంద్రబాబు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యతిరేకించాలని, ఆ దిశగా టీడీపీ, జనసేన, వైసీపీ ఎంపీలతో వ్యతిరేకంగా ఓట్లు వేయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. మహిళా బిల్లును సీపీఐ స్వాగతిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో గురువారం ఈశ్వరయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్ తో ముడిపెట్టి బీజేపీ ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందన్నారు. అందులో భాగంగా మహిళా బిల్లును పైకి చూపుతూ, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లులు ఉన్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల ఎంపీల స్థానాలను తగ్గించే కుట్రకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఒక వైపు మహిళ ప్రస్తుతం 131వ రాజ్యాంగ సవరణ పేరిట మహిళా బిల్లును ప్రవేశపెడుతూనే, మరోవైపు మోదీ ప్రభుత్వం డీ లిమిటేషన్ పేరిట మరో బిల్లు తీసుకొస్తూ దక్షిణాది రాష్ట్రాల ఎంపీల సంఖ్యను కదించి తన రాజకీయ మనుగడ సాధించేందుకు పార్లమెంట్ స్థానాలను 550 నుంచి గరిష్టంగా 850కి పెంచేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టనుందన్నారు. మహిళా సాధికారత కోసం సీపీఐ ఆది నుంచి పోరాడుతోందని ఈశ్వరయ్య వివరించారు. 1952 నుంచి 1966 వరకు పార్టీ ఎంపీగా ఉన్న రేణు చక్రవర్తి మహిళా హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడిన విషయాన్ని గుర్తుచేశారు.



అనంతరం సీపీఐ తరపున ఎన్నో సార్లు ఎంపీగా ఎన్నికైన గీతా ముఖర్జీ మహిళా రిజర్వేషన్ బిల్లుపై విస్తృత స్థాయిలో వివిధ పార్టీలను సమీకరించి చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేశారన్నారుఆ సమయంలో ఈ బిల్లును అడ్డుకునేందుకు ఉమా భారతి వంటి బీజేపీ ఎంపీలు..వివిధ సాకులతో అడ్డంకులు సృష్టించి, ఆ బిల్లు ముందుకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు నాలుగు రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మహిళా ఓటర్లను ఆకర్షించాలనే రాజకీయ స్వార్థంతో మహిళా బిల్లును కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చిందన్నారు. జనగణన జరగకుండా, డీలిమిటేషన్ ప్రక్రియ జరగకుండా, పార్లమెంట్‌లో తమకు బలం ఉందన్న సాకుతో డీ లిమిటేషన్ బిల్లును ఆమోదిస్తున్నారని చెప్పారు. 2024, 2029 కాకుండా 2034కు వాయిదా వేయడం వెనుక జనగణన, నియోజకవర్గాల పునర్విభజన వంటి ప్రక్రియలను కారణంగా చూశారని తెలిపారు. 1970లో జనాభా నియంత్రణ చర్యలను దక్షిణాదిలోని తమిళనాడు వంటి రాష్ట్రాలు.సమర్థవంతంగా అమలు చేశాయన్నారు. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పాటించకపోవడంతో అక్కడ జనాభా పెరిగిపోయిందని, ఫలితంగా అక్కడ ఎంపీ సీట్లు పెరగనున్నయని వివరించారు. దీనిని కేవలం రాజకీయ అంశం కాకుండా విధానపరమైన సమస్యగా, దక్షిణ భారత దేశం చూడాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ భారత దేశంపై బీజేపీ ప్రభావం తక్కువగా ఉన్నందున, ఉత్తర భారత దేశంపై రాజకీయ ఆదిపత్యం కోసమే ఈ ప్రయత్నాలకు ఒడిగట్టిందన్నారు. ఇప్పుడు అదే కారణంగా ఆయా రాష్ట్రాల ప్రాతినిధిత్వం తగ్గించే పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీల స్థానాలు తగ్గిపోతాయన్నారు. గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పేయ్ ప్రధాన మంత్రులుగా ఉన్న సమయంలో ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పటికీ, అది శాస్త్రీయ బద్ధంగా లేకపోవడంతో వాటిని వాయిదా వేసినట్లు గుర్తుచేశారు. భవిష్యత్‌లో అధ్యక్ష పాలన తీసుకొచ్చేందుకుగాను బీజేపీ ఈ తరహా కుట్రలకు పాల్పడుతోందన్నారు. డీ లిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నట్లుగా చంద్రబాబు నాయుడు తన లేఖలో స్పష్టత ఇవ్వలేదని, అలాగే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో టీడీపీ, జనసేన, వైసీపీ ఓటు వేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు సమగ్ర జనగణన, కులగణన నిర్వహించాల్సిన అవసరముందని ఆయన స్పష్టం చేశారు. కరోనా రీత్యా 2020-21లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా వాయిదా పడినా, ప్రపంచంలోని అనేక దేశాలు తమ జనగణన పూర్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2023లో బిల్లు ఆమోదించినప్పటికీ, 2025 నాటికి కూడా అవసరమైన ప్రక్రియలు పూర్తి చేయకుండా, ఇప్పుడు డీలిమిటేషన్‌ను ముందుకు తీసుకురావడం ప్రశ్నార్థకమని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డీలిమిటేషన్ విధానాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా ఈ అంశంపై తమ వైఖరిని వెల్లడించాలని, ప్రధానంగా పార్లమెంట్‌లో డీ లిమిటేషన్ బిల్లును టీడీపీ, జనసేన, వైసీపీ ఎంపీలు వ్యతిరేకించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. హరినాథ్ రెడ్డి, కె. రామాంజనేయులు, దోనేపూడి శంకర్, అలాగే ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్, ఎస్. వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు

## యల్లంగారి నరసింహం ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్ ) ఏప్రిల్ 16** కందుకూరు నియోజకవర్గం లో కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని అంకమ్మ పాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యల్లంగారి నరసింహం పక్షవాతం జబ్బుతో బాధపడుతూ ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడనే విషయాన్ని తెలుసుకున్న కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం గురువారం నరసింహం ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని , వైద్యుల సలహా మేరకు మందులు మింగుతూ ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. శివరాం వెంట కాకర్ల మల్లికార్జునరావు , ఉలవపాడు మాజీ ఎంపీటీసీ షేక్ బాజీ , కాటం లక్ష్మణ్ రావు తదితరులు ఉన్నారు

## ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎట్టిపరిస్థితిల్లో ఉపేక్షించమని ఎమ్మెల్యే జూలకంటీ



**విజ్ఞాన్ దినపత్రిక మణికుమార్ కారంపూడి (ఏప్రిల్ :17 )** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం కారంపూడి తాహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజలు నుంచి సమస్యలపై ఎమ్మెల్యే జూలకంటి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుంటేనే.., ప్రజలు ఎమ్మెల్యే వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకుంటారని చెప్పారు. ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎట్టిపరిస్థితిల్లో ఉపేక్షించమని సూచించారు. ఈ ప్రజాదర్భర్ లో దాదాపు 60 అర్జీలు వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీల రూపంలో అందించగా... వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీద సోదరులను జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించడం తగదు

**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్ ) ఏప్రిల్ 16** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బీద సోదరులను జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించడం తగదని, నెల్లూరు జిల్లాలో జగన్‌మోహన్‌రెడ్డి బీద సోదరుల గురించి తెలుసుకోకుండా ఎవరో పేపర్ వ్రాసి ఇస్తే అది తీసుకొని విమర్శంచడం తగదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. గురువారం కావలి పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. బీద మస్తాన్‌రావు అనేక గ్రామాలలో దళితులకు, గిరిజనులకు, ముస్లింలకు అనేక కార్యక్రమాలు చేపట్టి తన సంపాదనలో 25శాతం దాకా పేదలకు ఖర్చు పెడుతున్నారన్నారు. ఏ సమస్య వచ్చినా ఆర్థికంగా ఆదుకుంటాడని తెలిపారు. బీద మస్తాన్‌రావు ప్రత్యక్షంగాని, పరోక్షంగాని నాకు పరిచేయం లేదన్నారు. అయినా కాని గ్రామాలలో ప్రతినోట ఆయన చేసిన సహాయాన్ని చెప్పుకుంటున్నారని తెలిపారు. దేవాలయాలకు, మశీదులకు, చర్చిలకు ఆర్థికంగా సహాయం చేసాడని తెలిపారు. ముస్లిం సోదరులకు ఒడుగులు వంటి కార్యక్రమలకు ఆర్థిక సహాయం చేసారని తెలిపారు. ఆయనతో నాకు విబేదాలు ఉన్నప్పటికి అనేక మంది పేదలను అక్కున చేర్చుకున్నారని తెలిపారు. ఆయన మత్స్యకారులకు ఎక్కువగా సహాయం చేసారని తెలిపారు. మత్స్యకార గ్రామాలకు ప్రతి గ్రామానికి సహాయం చేసారని పేర్కొన్నారు. మత్స్యకార గ్రామాలలో ఆయనను పెద్ద కాపు



అనే వారు అని తెలిపారు. అలాంటి వ్యక్తి మీద అబండాలు వేయడం, రాజకీయం చేయడం తగదన్నారు. బీద సోదరులు ఎలాంటి వారో జిల్లా ప్రజలందరికి తెలుసు అని తెలిపారు. ప్రజలు అందరు అనుకుంటుంటే నేను చెప్పుతున్నానని తెలిపారు. అలాగే విష్ణువర్ధన్‌రెడ్డి కూడా పేదలకు ఆరోగ్యపరంగా ఎంతో మందికి సహాయం చేసారని తెలిపారు. అలాంటి వ్యక్తులను మనం గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. ఎవరు ఎటువంటి వారు అందరికి తెలుసు అని తెలిపారు. కాగితాలు వ్రాసి ఇస్తే విమర్శంచడం తగదన్నారు. బీద మస్తాన్‌రావు ఎవరిని విమర్శించరని తెలిపారు. వైఎసఆర్ పార్టీ నాయకులు తెలుసుకొని మాట్లాడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కనమూరి నరసింహారావు, ప్రసాద్, తిరుపతి, పాల్గొన్నారు.

## వైకుంఠ పురం ప్రాంతం లో పోలీసులు కార్డెన్ సెర్చ్



**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 16** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కావలిపట్టణంలోని వైకుంఠపురంలో పెంకుల ఫ్యాక్టీరి ప్రాంతంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి నిర్వహించిన ఈ తనిఖీల్లో ఎలాంటి ధ్రువ పత్రాలులేని 28 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో సీజ్ చేశారు. ఈ సోదాల్లో కావలి నూతన డీఎస్పీ వీవీ రమణ కుమార్ పాల్గొని స్థానికులకు పలు సూచనలు చేశారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వారికి సహకరించి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు గిరిబాబు,రాజేశ్వరరావు, ఎస్సైలు సుమన్,గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో సీఎం:చంద్రబాబు జన్మదిన వేడుకలకు సన్నాహాలు

**బాబు ఏసిపోగు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** ఈనెల 20వ తేదీనతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి జన్మదినం సందర్భంగా తన నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరులో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి భారీ కార్యక్రమాలకు రూపకల్పనచేస్తున్నారు.. ఆత్మకూరు పట్టణంలోని ఏఎంసీ కాంపౌండ్ లో వివిధ కార్యక్రమాలకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ చేపడుతున్న ఏర్పాట్లను నేడు ఆనం వారసులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఆనం రంగ మయూర్ రెడ్డి స్థానిక పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు.. ఈ ప్రాంగణంలో భారీ దేవాలయం సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది..దేవాలయ గోపురం నిర్మిస్తూ మిగిలిన పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నారు ప్రత్యేక హోమాలు ఇతర కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నారు.. ఇక్కడ చేపడుతున్న పనులను పరిశీలించి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆత్మకూరులో ఘనంగా



నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నామని, నియోజకవర్గంలోని పార్టీ నేతలు కార్యకర్తలు పట్టణ ప్రజలందరూ పాల్గొని నారా చంద్రబాబు నాయుడు గారిని ను దీవించాలని కోరారు.. వీరి వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకురాలు పులిమి శైలజా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వెంకట రమణమ్మ, ఆత్మకూరు ఏఎంసీ చైర్మన్ జనార్ధన్ నాయుడు, సీఐ గంగాధర్ మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు ఇతర నాయకులు పాల్గొన్నారు..

## మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఉప-కోటా కల్పించాలన్న డిమాండ్

**-- 'బీసీ మహిళా పోరు దీక్ష'లో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్**



**నెల్లూరు (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 16** న్యూఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ మహిళా పోరు దీక్ష లో రాజ్యసభ సభ్యులు డా. బీద మస్తాన్ రావు యాదవ్ ఈ రోజు పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో వెనుకబడిన వర్గాల (బీసీ ) మహిళలకు ప్రత్యేక ఉప-కోటా కల్పించాలని ఆయన బలంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో బీసీ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఇంకా వెనుకబడి ఉన్నారని, వారికి సముచిత ప్రతినిధిత్వం కల్పించాలంటే మహిళా రిజర్వేషన్ బిల్లులో ప్రత్యేక ఉప-కోటా తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కూడా ఈ అంశాన్ని బలంగా ప్రస్తావిస్తానని, బీసీ మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఈ దీక్షలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన బీసీ మహిళా నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# జనగణనకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోండి..!

**-తాహసిల్దార్ పద్మజాకుమారి**



**బాబు ఏసిపోగు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు.** ఆత్మకూరు ప్రాంతంలో జనగణనకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ నేటి నుండి ప్రారంభమవుతుందని ఆత్మకూరు తహసిల్దార్ పద్మజ కుమారి తెలిపారు..ఈనెల 16 నుండి 30వ తేదీ వరకు ప్రజలే నేరుగా తమ సెల్ ఫోన్ నుండి జనగణన పోర్టు ద్వారా తమ వివరాలు నమోదు చేసుకునే ప్రక్రియ ఉందని తెలిపారు. ఈ యాప్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ నమోదు చేసుకున్నక ఇంటింటి సర్వే కి వచ్చిన సమయంలో ఈ సమాచారాన్ని సర్వే సిబ్బంది కి తెలియపరచాలని అన్నారు..నమోదు చేసిన వివరాలను ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందని తహసిల్దార్ తెలిపారు.

# రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించిన కలెక్టర్

**నెల్లూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** నెల్లూరు జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని గురువారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశమునకు జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్లతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. సదరు సమావేశంలో కలెక్టర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ,పిఎం రాహత్ స్కీం,రోడ్డు భద్రతా చర్యల అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ఈ క్రమంలో జిల్లాలో గత క్వార్టర్‌లో జరిగిన రోడ్డు ప్రమాద మరణాలపై వివరణాత్మకంగా రోడ్డు ప్రమాదాలు ఎలా జరిగాయి,వాటి ప్రధాన కారణాలు ఏమిటి అనే అంశాలపై అన్ని కోణాల్లో టెక్నికల్ అనాలిసిస్ ఆధారంగా ప్రతి రోడ్డు ప్రమాదాన్ని శాస్త్రీయంగా పరిశీలించి,ఖచ్చితమైన కారణాలను గుర్తిస్తూ విశ్లేషణ వివరాలను ఎస్పీ పిపిటి ద్వారా ప్రెసెంటేషన్ ఇచ్చారు. ప్రజెంటేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. రాబోయే మీటింగ్‌కు మిగిలిన శాఖలు అధికారులు కూడా మరింత సమగ్ర సమాచారం,ఫీల్డ్ స్థాయి వివరాలతో సిద్ధంగా రావాలని ఆయన సూచించారు. తదుపరి ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫేటల్ ఆక్సిడెంట్ కేసును ఒక హత్య కేసు దర్యాప్తు మాదిరి విచారణ చేయాలని డీజీపీ ఇచ్చిన సూచనలు మేరకు జిల్లాలోని ప్రతి లా అండ్ ఆర్డర్,ట్రాఫిక్ డివిజన్ పోలీస్ అధికారులు సంబంధించిన శాఖల సమన్వయముతో పని చేస్తున్నారని తెలిపారు. రోడ్ సేఫ్టీ విషయంలో నిర్లక్ష్యం వలన ప్రమాదాలకు




కారణమైన వారిపై, విధుల్లో అలసత్యం ప్రదర్శించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సౌజన్య డి టి ఆర్ బి తరపున తయారు చేసిన రోడ్ సేఫ్టీ డేటా, పిఎం రాహత్ అమలులో భాగంగా టిఎంఎస్ సాఫ్ట్వేర్ డేటా ఎంట్రీ స్టేట్,జిల్లా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ విభాగాలు పిఎం రాహత్ స్కీంలో రోడ్డు ప్రమాద ఘటన,భాదితుల వివరాలు,ఎంట్రీ అన్ని పోలీస్ స్టేషన్స్ ఈ.దార్ ద్వారా వచ్చే అలెర్ట్ గురించి,పోలీస్ అధికారులు చేపడుతున్న అవగాహనా సదస్సులు,చర్యలు గురించి ఈ సమావేశంలో వివరించారు.

## ఫైర్ స్టేషన్ ఆఫీసర్,సిబ్బంది ని సత్కరించిన వాసవి క్లబ్ సేవన్ లయన్స్,వాసవి క్లబ్ వనిత లెజండ్స్




**కావలి, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ :** గురువారము ఉదయము 10 గంటలకు ఫైర్ డిపార్ట్మెంట్ వారోత్సవాల సందర్భంగా, మరియు క్యాలండర్ అఫ్ ఈవెంట్స్ లో అగ్నిమపాక దళ సిబ్బందిని వారి సేవలను గుర్తించి ప్రశంసించాలనే ఆలోచనతో ఫైర్ డిపార్ట్మెంట్ ఆఫీషర్ శ్రీనివాస్ రెడ్డి,వారి సిబ్బంది తదితరుల సమక్షంలో అగ్ని వల్ల ఏదైనా ప్రమాదం వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దాని గురించి, ప్రమాదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలగు వాటి గురించి అవగహనా సదస్సు వాసవి క్లబ్ సెవెన్ లయన్స్ మరియు వాసవి వనిత లెజండ్స్ కావలి వారు సంయుక్తంగా కలిసి నిర్వహించడం జరిగింది . జోన్ చైర్మన్ దుగ్గిశెట్టి హేమలత, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ పాదర్తినాగరాజు ఆధ్వర్యంలో మన వాసవి వనిత లెజండ్స్ డి. ఓ పానుగంటి నిరూప, సెక్రటరీ పెట్టుగాని సుధారాణి, ట్రెసరర్ తాత శైలజ, జోన్ సెక్రటరీ భవనాసి సువర్ణ, జాయింట్ సెక్రటరీ భావన ,వైస్ ప్రెసిడెంట్ శనగపల్లి గీతా,తటవర్తి జ్యోతి అందరూ మరియు సెవెన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వేమూరి శ్రీనివాసులు,సెక్రటరీ పెసల పవన్,కోశాధికారి రాజా సుబ్బారావు గాధంశెట్టి వేణు గోపాల్,ఎల్చూరి రవి, పెట్టుగాని రమేష్.ఇడిముక్కల శ్రీధర్. సభ్యులు పై కార్యక్రమంలో పాల్గొని దిగ్విజయం చేసినందుకు అందరికి ధన్యవాదములు తెలియజేసిన వాసవి క్లబ్ నిర్వహుకులు.

# సి.బి.యస్.ఇ పదో తరగతి ఫలితాల్లో ఓవెల్ 18 పాఠశాల విద్యార్థులు ప్రభంజనం




సి.బి.యస్.ఇ పదో తరగతి(2025 26) సెక్షన్-1 ఫలితాలలో, కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెం, బుచ్చి క్రాస్ రోడ్డులోని ఓవెల్ 18 సి.బి.యస్.ఇ పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాఠశాల చైర్మన్ మరియు డైరెక్టర్ ఆర్. వేణు మాట్లాడుతూ ఈరోజు విడుదలైన సి.బి.యస్.ఇ పదోతరగతి పరీక్ష ఫలితాలలో పాఠశాల స్థాయి ఫలితాల్లో, తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు. సిద్దారెడ్డి. రేష్మా రెడ్డి 485 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారని అలాగే కాకు. నాగ చైతన్య 465 మార్కులతో ద్వితీయ స్థానం, దంపూరు. చరిత్ రెడ్డి 455 మార్కులతో తృతీయ స్థానం, చిత్తలూరు. హిరణ్యప్రియ 455 మార్కులతో నాలుగవ స్థానం, కోట. సుచిత్ర 441 మార్కులతో ఐదవ స్థానంలో నిలిచారు అని ఆయన తెలియజేశారు. 52 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా అందులో నలబై రెండు మంది (80%) ప్రథమ శ్రేణిలో, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు అని ఆయన అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ విజయానికి తోడ్పడిన విద్యార్థులకు మరియు అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ ఆర్. ప్రమీలా , జి.ఎమ్. మహదేవ , ఇ.డి. వి. బాలు , , ప్రిన్సిపాల్ వంశీకృష్ణ మరియు వైస్ ప్రిన్సిపాల్ రేషనల్ లెర్నింగ్ డి.జి.ఎమ్. రఫీ , ఎఫ్.డి. శ్రీనివాసులు జనార్ధన్ , ఏ.జి.ఎమ్. యం. సురేష్ , క్యాంపస్ ఇంచార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్, దామచర్ల సత్య, నూకసాని బాలాజీ లకు అభినందనలు తెలిపిన బైరెడ్డి, దారపనేని



**కనిగిరి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 17** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు నూకసాని బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్ గా దామచర్ల సత్యా, కార్యనిర్వహక కార్యదర్శిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ను తెలుగుదేశం పార్టీ నియమించటం హర్షించదగ్గ పరిణామం అని, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గురువారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి, దారపనేని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు సారధ్యంలో ఎన్నికైన వారు పార్టీని పటిష్టమైన కార్యచరణతో తీసుకెళ్లేందుకు బుధవారం ప్రకటించిన నాయకులందరూ అహర్నిశలు పార్టీ ప్రయోజనాల కోసం, క్షేత్రస్థాయి నుండి పార్టీ బలోపేతం కొరకు అనునిత్యం కృషి చేస్తారని ఆకాంక్షించారు. తాతాయపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు గోరంట్ల ప్రభాకర్ అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

# 2 ఫిషింగ్ సొసైటీల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కాకర్ల..!

**-ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో అధికారులతో కీలక చర్చలు..!**

**-మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశం..!**

**-ఫిషింగ్ సొసైటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ..!**








**-పేద మత్స్యకార కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం -- ఎమ్మెల్యే కాకర్ల..!**

**వింజమూరు ఏప్రిల్ 16** తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నందు ఉదయగిరి నియోజకవర్గం లోని మత్స్యకారుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని, అక్కడి 12 ఫిషింగ్ సొసైటీలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఫిషరీస్ శాఖ జాయింట్ డైరెక్టర్ , సంబంధిత అధికారులు, అలాగే వివిధ ఫిషింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను వివరంగా వెల్లడించారు. సమావేశం సందర్భంగా ప్రతి సమస్యను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడేలా అవసరమైన సదుపాయాలు కల్పించడం, చెరువుల అభివృద్ధి, వలలు మరియు ఇతర పరికరాల సరఫరా, అలాగే ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం పట్ల ఎల్లవేళలా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, పేదల మరియు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఫిషింగ్ సొసైటీల ద్వారా నిరుపేద మత్స్యకార కుటుంబాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు, రాయితీలు అందించి వారి ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మత్స్యకారుల కుటుంబాలు స్వయం సమృద్ధిని సాధించి, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పడుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశం ద్వారా మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగినదని తెలియజేశారు.

# వైకుంఠ పురం ప్రాంతం లో పోలీసులు కార్డెన్ సెర్చ్



**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 16** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కావలిపట్టణంలోని వైకుంఠపురంలో పెంకుల ఫ్యాక్టీరి ప్రాంతంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి నిర్వహించిన ఈ తనిఖీల్లో ఎలాంటి ధ్రువ పత్రాలులేని 28 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో సీజ్ చేశారు. ఈ సోదాల్లో కావలి నూతన డీఎస్పీ వీవీ రమణ కుమార్ పాల్గొని స్థానికులకు పలు సూచనలు చేశారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వారికి సహకరించి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు గిరిబాబు,రాజేశ్వరరావు, ఎస్సైలు సుమన్,గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# మన్నెమాల సుకుమార్‌రెడ్డి తో రాజకీయ ప్రయాణం



**కావలి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 17** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం బోగోలు మండలం బోగోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మేకల సుజాత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి మేకల శ్రీనివాసులు దంపతులు సంచలన ప్రకటన నెల్లూరు జిల్లా కావలి అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో అనూహ్య రాజకీయ పరిణామం రాబోయే రోజుల్లో సీనియర్ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి తో కలిసి రాజకీయ ప్రయాణం చేస్తామని బోగోలు ఎంపీపీ మేకల సుజాతమ్మ, శ్రీనివాసులు దంపతులు వెల్లడించారు

# మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం - పూజిత"

**నెల్లూరు (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 17** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత మాట్లాడుతూ మహిళా బిల్లుకు వైయస్ఆర్‌సీపీ సంపూర్ణ మద్దతు



- మహిళలను సాధికారత వైపు నడిపించిన నాయకుడు వైయస్ జగన్
- మహిళా రిజర్వేషన్‌పై మాట్లాడే అర్హత జగన్ తర్వాతే ఇతరులకు ఉంటుంది
- మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించిన ఏకైక నాయకుడు జగన్
- వైయస్ఆర్‌సీపీ నిజమైన మహిళా పక్షపాత పార్టీ అని స్పష్టం
- కేబినెట్‌లో కీలక శాఖలు మహిళలకు ఇచ్చిన ప్రభుత్వం జగన్‌దే
- ముస్లిం మహిళకు శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవి..ఇది చారిత్రాత్మక నిర్ణయం
- చీఫ్ సెక్రటరీ, ఎలక్షన్ కమిషనర్‌గా మహిళలను నియమించిన సీఎం జగన్
- స్థానిక సంస్థలు, ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట
- మహిళల హక్కులు, గౌరవం కోసం పనిచేసిన నాయకుడు జగన్ అని ప్రశంస
- మహిళా సాధికారత చరిత్రలో జగన్ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది
- ఆంధ్రప్రదేశ్ మహిళలందరూ జగన్‌కు రుణపడి ఉంటారని కాకాణి పూజిత వ్యాఖ్య

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.